క్లుప్తంగా

వ్యాక్సినేషన్ వందశాతం పూర్తి చేయాలి

● డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను వందం శాతం పూర్తి చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో ఆమె గురువారం అధికారులతో సమీక్షించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి జన్ ఔషధి యోజన ద్వారా తక్కువ ధరకు అందే మందులు, మాత్రలను ప్రజలు వినియోగించుకునేలా చూడాలన్నారు. నేషనల్ సికెల్ సెల్ అనిమీయా కింద నమో దైన వ్యక్తులకు అవగాహన కల్పించి ఉచిత వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, డీఐఓ హనుమంతరావు, డీఎంఓ వేణు గోపాల్, డాక్టర్లు గిరి, ప్రవీణ, అనూష, రామ్మోహన్, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదుపై సోషల్ ఆడిట్



ఈ–పంట సోషల్ ఆడిట్‌లో పాల్గొన్న రైతులు

గుడిపాల: ఈ ఏడాది రబీ సీజన్‌లో ఈ–పంట నమోదు చేసిన రైతులు, పంటల వివరాల సామాజిక తనిఖీ కోసం ఆయా రైతు సేవా కేంద్రాల్లో సామాజిక తనిఖీ ముసాయిదా జాబితా ప్రదర్శిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. గురువారం పానాటూరు రైతుసేవా కేంద్రంలో జాబితాను ప్రదర్శించి ఆమె మాట్లాడారు. జాబితాలో ఏవైనా మార్పు లు–చేర్పులు చేయాల్సిన పక్షంలో రైతులు అర్జీ రూపంలో తమ దృష్టికి తెస్తే సవరణలు చేస్తామని, తుది జాబితాను తయారు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లవి, వీఏఏ తులసిరామ్‌రెడ్డి, వీఆర్‌ఓ జశ్వంత్‌కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధే ధ్యేయం



సంఘమిత్రల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం సుధారాణి

గుడిపాల: మహిళా సంఘాల అభివృద్ధే తమ ధ్యేయమని ఇందిరక్రాంతి పథం ఏపీఎం సుధా రాణి అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం సంఘమిత్రలకు నిర్వహించారు. ఆమె మాట్లాడు తూ, గ్రామ సంఘాలు అభివృద్ధి చెందితేనే మండల సమాఖ్యలు అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. మహిళలకు స్త్రీనిధి రుణాలను విరివిగా ఇవ్వాలని, తీసుకున్న రుణాలను సకాలంలో కట్టించేలా సంఘమిత్రలు చూడాలన్నారు. గుడిపాల మండలం ఎప్పటికీ ఏ–గ్రేడ్‌లో ఉండేలా పని చేయాలని ఆదేశించారు.

హైఓల్టేజీతో విద్యుత్ ఉపకరణాలు ఔట్!

చిత్తూరు కార్పొరేషన్: హై ఓల్టేజీ దెబ్బకు పలువురి ఇళ్లలో విద్యుత్ ఉపకరణాలు కాలిపోయిన సంఘటన గురువారం నగరంలోని కొంగారెడ్డిపల్లె పాత భజనగుడి వీధిలో చోటుచేసుకుంది. మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల నడుమ హై ఓల్టేజీ సరఫరా అయ్యింది. దీంతో కొందరి ఇళ్లలో ఫ్రిడ్జి, ఫ్యాన్లు, స్టెబిలైజర్, వాటర్ ప్యూరిఫయర్, టీవీ, సెటప్‌బాక్స్.. మొదలైనవి పనిచేయకుండా పోవడంతో లబోదిబోమన్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ రామును సంప్రదించగా తమకు దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు.

నోటీస్ బోర్డు

రాయితీపై వ్యవసాయ పరికరాలు

తవణంపల్లె: వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 204–25 ఆర్థిక సంవత్సరానికి 50 శాతం రాయితీపై రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ తెలిపారు. మండలానికి 8 స్ప్రేయర్లు, 19 పవర్ స్ప్రేయర్లు, 24 ట్రాక్టర్ పరికరాలు, రొటావేటర్ ఒకటి మంజూరైనట్లు తెలిపారు. ఒక రైతుకు ఒకటి మాత్రమే మంజూరు చేస్తామన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. 11 గంటలకు సుదర్శన హోమం, రాత్రి ప్రాకారోత్సవం నిర్వహిస్తామని, అలాగే భక్తుల కాలక్షేపం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.

గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ సేవలతో ప్రజలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేరువైతే, అధికారంలోకి వచ్చింది మొదలుకుని ఆ సేవలకు స్వస్తి పలికిన కూటమి ప్రభుత్వం ప్రజలను అవస్థల పాల్జేస్తోంది. దాదాపు 554 రకాల సేవలందిస్తున్న గ్రామ/వార్డు సచివాలయాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందనే విమర్శలొస్తున్నాయి. ఫలితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతరత్రా ప్రయోజనాలు అర్హులకు అందని ద్రాక్షలా మారాయని ప్రజలు వాపోతున్నారు.



గుడిపాలలోని గ్రామ సచివాలయం

సేవలకు మంగళం.. ప్రజలకు సంకటం

- సచివాలయాల్లో సేవలకు స్వస్తి పలికిన కూటమి ప్రభుత్వం
- కొత్తరేషన్ కార్డులు, పింఛన్ల మంజూరు నిల్
- ఉద్యోగులను నిలదీస్తున్న ప్రజలు
- మరోవైపు ఇంటింటి సర్వేల పేరిట ఉద్యోగులకూ ఇక్కట్లు

గుడిపాల: చిత్తూరు నియోజకవర్గంలో చిత్తూరు అర్బన్‌లో 51 వార్డు సచివాలయాలు, గుడిపాలలో 17, చిత్తూరు రూరల్‌లో 9 గ్రామ సచివాలయాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటయ్యాయి. వీటిలో దాదాపు 600 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. అప్పట్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అర్హత ఉన్న అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అందజేశారు. ప్రస్తుతం చంద్రబాబునాయుడు పాలనలో దీనికి పూర్తిగా భిన్నమైన పాలన సాగుతోంది.

రేషన్ కార్డులు, పింఛన్లు ఎప్పుడిస్తారయ్యా!?

ఇంటింటా సర్వే, పింఛన్ల పంపిణీ సమయంలో ప్రజల నుంచి.. కొత్త పింఛన్లు రాస్తున్నారా అయ్యా... రేషన్‌కార్డు కోసం అప్లికేషన్ తీసుకుంటున్నారా అమ్మా... అంటూ ఆశగా అడుగుతున్న పేద, మధ్య తరగతి ప్రజల ప్రశ్నలకు సచివాలయ ఉద్యోగుల వద్ద సమాధానం లేదు. రేషన్ కార్డుల కోసం పేదలు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా మంజూరు చేయకపోవడంతో పేదలు శాపనార్థాలు పెడుతున్నారు.

ప్లేటు ఫిరాయించిన సీఎం

గత ప్రభుత్వంలో వలంటీర్లతో సర్వేలు చేయించడాన్ని తప్పుబట్టిన అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు .. తాను అధికారంలోకి వచ్చాక ప్లేటు ఫిరాయించారు. ఏకంగా సచివాలయ ఉద్యోగులను సర్వేల పేరుతో నిరంతరం తరుముతున్నారు. మొత్తం 15 రకాల ఇంటింటి సర్వేలతో సచివాలయ ఉద్యోగులు మల్లగుల్లాలు పడుతున్నారు. సర్వే చేస్తున్నాం.. ఓటీపీ చెప్పండి అని అడిగితే జనం మండిపడుతున్నారని, ఓటీపీలు చెప్పేందుకు నిరాకరిస్తున్నారని మరోవైపు ఉద్యోగులు వాపోతున్నారు. సెలవు రోజులతో సంబంధం లేకుండా సర్వేలు చేయాలని ఆదేశించడం, సర్వే పేరుతో టార్గెట్లు పెట్టడం, మరోవైపు మాతృశాఖ పనులు, బీఎల్‌ఓ విధులు.. ఇలా అన్ని రకాల పనులు పూర్తిచేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఉద్యోగ సంఘాల ప్రతి నిధులు గగ్గోలు పెడుతున్నారు. పని భారం విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోవడం, సర్వేల పేరుతో ఇతర శాఖల అధికారుల వేధింపులు.. పరిస్థితి మారకుంటే ధర్నా చేస్తామంటూ ఏఎన్ఎంలు మూడురోజుల క్రితం ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు ఇతర శాఖల ఉద్యోగులు సైతం ఇదే బాటలో పయనించేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

నాడు కళకళ.. నేడు వెలవెల

10 నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాల సేవలను పూర్తిగా నీరుగార్చడంతో ప్రజలు తమ సమస్యలపై కలిసేందుకు మండల కేంద్రాల్లో అధికారుల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోంది. అక్కడా పరిష్కారం కాకుంటే వ్యయ ప్రయాసం కోర్చి ఆర్డీఓలు, జిల్లా కేంద్రానికి వెళ్లి తమ సమస్యలపై వినతి పత్రాలు ఇస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ కార్యకలాపాల్లో టీడీపీ, జనసేన నాయకులు మితిమీరిన జోక్యం కారణంగా అర్హులకు కాకుండా కూటమి కార్యకర్తలకు మాత్రమే లబ్ధి చేకూరుస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఉపాధి హామీ నిధులతో సబ్సిడీపై ఇస్తున్న పశుగ్రాసం యూనిట్లు, గోకులం షెడ్ల నిర్మాణం, బీసీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ రుణాల మంజూరు.. ఇలా ప్రతి పథకంలో నేరుగా కూటమి సానుభూతిపరులనే లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. కులం, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్, బర్త్, డెత్ తదితర సర్టిఫికెట్లకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నా మండల కేంద్రాల్లో అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోందని, అంతేకాకుండా ఆలస్యంగా వీటిని ఇస్తున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 18 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి రూ.1.80 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి గురువారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యాబాబు రెండు రోజులపాటు వాహనాలు తనిఖీ చేశారు. పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి మొత్తం 18 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

క్రీడలూ ముఖ్యమే



క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న చుడా చైర్‌పర్సన్, ఎంఈఓ

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమేనని చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత అన్నారు. నగరంలో రామ్‌నగర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాలలో గురువారం డాక్టర్ బీఎస్ రావ్ మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వివిధ ప్రాంతాల విజేతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు ప్రదానం చేసి మాట్లాడారు. అనంతరం ఎంఈవో సెల్వరాజ్, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏజీఎం సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో చిత్తూరు రీజియన్ ఇన్‌చార్జి చక్రధర్, మదనపల్లె రీజియన్ ఇన్‌చార్జి శ్రీధర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీపీఎం ప్రజా చైతన్యయాత్ర



మాట్లాడుతున్న గంగరాజు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఉన్న స్థానిక సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నుంచి ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి గంగరాజు తెలిపారు. గురువారం చిత్తూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సమస్యలపై యాత్రలో వివరాలు నమోదు చేసుకుంటామన్నారు. ఈనెల 20 తర్వాత సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఒత్తిడి తెచ్చే దిశగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు సమస్యల తెలియజేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా ఎక్కడి సమస్యలు అక్కడే రాజ్యమేలుతున్నాయని, పట్టించుకున్న పాపానపోవడం లేదని ఆరోపించారు. సమావేశంలో నాయకులు భువనేశ్వరి, సురేంద్రన్ ఓబుల్ రాజు, గిరిధర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం: ఇద్దరు మహిళల అరెస్ట్

చిత్తూరు అర్బన్: గంగాధరనెల్లూరు మండలం వింజం బస్ స్టాప్‌లో గురువారం సారా స్వాధీనం చేసుకుని కళావతి(48) అనే మహిళ నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. అలాగే సారా తరలిస్తూ పట్టుబడ్డ పెనుమూరు మండలం విధిపల్లెకు చెందిన శారద (40)ను కూడా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లు పంపిణీ





రైటింగ్ ప్యాడ్లను పంపిణీ చేస్తున్న ఈడిగ గౌడ్ సంఘం నాయకులు, శ్రీ సత్యసాయి సేవా సంఘం నిర్వాహకులు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని కట్టమంచి నగర పాలక హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు సత్యసాయి సేవా సంస్థలు, ఈడిగ గౌడ్ సంఘం నాయకులు గురువారం రైటింగ్ ప్యాడ్లను పంపిణీ చేశారు. పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడి గురికాకుండా రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంఘం జిల్లా అధ్యక్షులు మధుసూదనం, జిల్లా ఈడిగ గౌడ్ సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

● డీపీఓ సుధాకర్‌రావు



కాణిపాకం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ

ఐరాల: గ్రామ పంచాయతీలకు సంబంధించిన అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ కార్యదర్శి సుధాకర్ రావు ఆదేశించారు. గురువారం మండలంలోని కాణిపాకం, పాలకల గ్రామ పంచాయతీ కార్యాలయాలను ఆయన తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను సక్రమంగా నిర్వహించని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కుసుమకుమారి, పాలకల పంచాయతీ సెక్రటరీ చిరంజీవి పాల్గొన్నారు.

పాడి పశువులకు వ్యాక్సిన్లు



పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ సాయిసుధ

గుడిపాల: నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకూ తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసుకోవాలని పశువైద్యాధికారి సాయిసుధ కోరారు. గురువారం తుమ్మలవారిపల్లె, వీసీ కండిగ, అనుపు ఎస్టీ కాలనీల్లో 210 పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు వేసి ఆమె మాట్లాడారు. పాడి పశువులు వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తతో టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. పశువులను కట్టే పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన యుసిమాస్ అబాకస్ సంస్థ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా స్థాయిలో నిర్వహించిన అబాకస్ అంతర్గత పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని యుసిమాస్ అబాకస్ సంస్థ డైరెక్టర్లు భార్గవి, ఉమ తెలిపారు. గురువారం నగరంలోని ఆ సంస్థ కార్యాలయంలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, తమ విద్యార్థులు షేక్ ఆయత్ ఫైజన్, వినీషారెడ్డి చాంపియన్ ఆఫ్ చామన్ అవార్డులను కైవసం చేసుకున్నారన్నారు. ఈ పోటీల్లో 200 లెక్కలను 8 నిమిషాల్లో పూర్తి చేశారన్నారు. ఈ పోటీల్లో 15 మంది మొదటి బహుమతి, 18 మంది రెండవ బహుమతి, 25 మంది మూడవ బహుమతి, ఇతర బహుమతులు పొందారన్నారు. అనంతరం ఆ విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు ప్రదానం చేశారు.

‘స్వచ్ఛ సర్వేక్షణ్’ లో చిత్తూరుకు ఓటెయ్యండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మేయర్, కమిషనర్ తదితరులు

చిత్తూరు అర్బన్: దేశ వ్యాప్తంగా ఉత్తమ మునిసిపాలిటీల ఎంపిక కోసం నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌కు ప్రజలు ఓట్లేయాలని మేయర్ అముద కోరారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ నరసింహప్రసాద్‌తో కలిసి ఆమె స్వచ్ఛ సర్వేక్షణ్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో చిత్తూరుకు మెరుగైన స్థానం వస్తోందన్నారు. ఈసారి కూడా ఉద్యోగులు, యువత, మహిళలు ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

189 కొత్తపల్లెలో ‘ఫ్యామిలీ డాక్టర్’



కృష్ణాపురంలో మహిళకు రక్తపోటు పరీక్షిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

గుడిపాల: మండలంలోని 189కొత్తపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్య గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్, అలాగే బీపీ, మధుమేహ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది విజయ, చంద్రశేఖర్, సునీత, అనురాధ, అనిత,ఎలవతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

తెల్లగుండ్లపల్లె, కృష్ణాపురంలో..

తవణంపల్లె: మండలంలోని తెల్లగుండ్లపల్లె, కృష్ణాపురంలో గురువారం వైద్యాధికారులు డాక్టర్ కేశవనారాయణ, డాక్టర్ వినయ్‌కుమార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన ఆహారం, పాటించాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీహరి, రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తెల్లగుండ్లపల్లెలో వృద్ధులను పరీక్షిస్తున్న డాక్టర్ కేశవనారాయణ



గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సంధ్య

టౌనుకొచ్చిన అడవి పందులు!



మిట్టూరులో సంచరిస్తున్న అడవి పందుల గుంపు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో గురువారం వేకువజామున అడవి పందుల గుంపు సంచారం చర్చనీయాంశమైంది! మిట్టూరులోని అన్నాస్వామి మొదలియార్ వీధిలో అర్ధరాత్రి 2–3 గంటల మధ్య అడవి పందుల గుంపు హల్‌చల్ చేసింది. అవి గుంపులుగా రావడం సీసీ కెమెరాలో రికార్డు అయింది. వాటి శబ్దాలకు కొందరు లేచి చూశారు. అవి ఎక్కడ దాడి చేస్తాయోనని బయటకు వెళ్లే సాహసం చేయలేదు. సాధారణంగా వేసవిలో అడవిలో ఆహారం కొరత అడవి పందులు బయటకు వస్తూంటాయని, ఇవి మూడో రైల్వేగేటు వైపు ఉన్న అటవీ ప్రాంతం నుంచి వచ్చి ఉండవచ్చని అటవీ సిబ్బంది చెప్పారు. మొత్తానికి మా ఏరియాలో అడవి పందులు నైట్ విజిట్ చేశాయబ్బా..! అని మిట్టూరు ప్రాంతవాసులు ఆసక్తిగా చర్చించుకున్నారు. మరికొందరు మాంసం ప్రియులు మాత్రం ఆ టైమ్‌లో వీటినిగానీ మూడోకంటికి తెలీకుండా ఏసేసి ఉంటే.. నా సామిరంగా..పండగే..పండగ అని నిట్టూర్చారు!

కదిరిముత్తనపల్లెలో పెద్దదేవర సందడి



భీరేశ్వర, చెన్నకేశ్వర, సిద్ధేశ్వర, బత్తేశ్వర, రేవణ సిద్ధేశ్వర స్వాములు



ఆలయ ఆవరణలో జనసందోహం

శాంతిపురం: తొమ్మిదేళ్లకు ఓ సారి జరిగే కురబ కులస్తుల పెద్దదేవర సందర్భంగా భక్తుల రాకతో కొలమడుగు పంచాయతీలోని కదిరి ముత్తనపల్లిలో సందడి నెలకొంది. గురువారం శ్రీ సిద్ధేశ్వరస్వామి, శ్రీ భీరేశ్వరస్వామి, శ్రీ రేవణ సిద్ధేశ్వరస్వామి, శ్రీ బత్తేశ్వరస్వామి, శ్రీ చెన్నకేశ్వరస్వాము లకు పంచామృత అభిషేక అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం తమటమొద్దు పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కదిరిముత్తనపల్లి దారుల్లో వాహనాలు బారులు తీరాయి. మూడు రోజుల పాటు పూజల కోసం 2 వేల కుటుంబాలు ఇక్కడికి వచ్చి టెంట్లు వేసుకోవడంతో ఆలయం నుంచి కిలోమీటరు వరకూ షామియానాలు, వాహనాలతో నిండిపోయాయి. శుక్రవారం తలలపై కొబ్బరికాయలు కొట్టే కార్యక్రమం ఉండడంతో దీనికి 4 లక్షల మంది జనం వస్తారని ఆలయ ధర్మకర్త మునిరత్నంగౌడు చెప్పారు. ఉత్సవాలకు సీఎం సతీమణి భువనేశ్వరి శనివారం వస్తున్న నేపథ్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

మురుగు పైనే భక్తుల అవస్థల ప్రయాణం

ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తారంటున్న కదిరిముత్తనపల్లి ఉత్సవాల కు సరైనా రవాణా మార్గాలు లేకపోయాయి. నల్లరాళ్లపల్లిలో రోడ్డుపై పారుతున్న మురుగు నీటి మీదుగానే భక్తులు కదిరిముత్తనపల్లి ఆలయానికి చేరుకోవాల్సి వస్తోంది. విస్తృత ఏర్పాట్లు చేశామంటున్న అధికారులు ఈ చిన్న విషయాన్ని కూడా పట్టించుకోలేదని భక్తులు మండిపడుతున్నారు. దండికుప్పం రోడ్డు నుంచి నల్లరాళ్లపల్లి మీదుగా వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కొత్తగా మట్టి తోలే సందర్భంలో సిమెంటు, తారు రోడ్లపై పోసిన మట్టిని తొలగించకపోవడంతో భారీ ఎత్తున దుమ్మురేగుతోంది. మరోవైపు వందలాది వాహనాలు రావడంతో ఇరుకు రోడ్డుపై ఇక్కట్లు తప్పలేదు. శుక్రవారం పదింతల సంఖ్యలో వాహనాలు వస్తాయని అంచనా వేస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ కష్టాలు మరింత తీవ్రం కానున్నాయి.